### నెల్లూరు మేయర్ అభ్యర్థిగా పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్ ఖరారు

- ఖరారు చేసిన టిడిపి అధిష్టానం
- ముందే చెప్పిన అక్షర దర్శిని దినపత్రిక

03





RNI: APTEL/26/A8235

# అక్షర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక



**అక్షర దర్శిని**

దినపత్రికలో పని చేయడానికి అనుభవం కలిగిన, జర్నలిజంపై ఆసక్తి ఉన్న రిపోర్టర్లు కావలెను. కొత్త వారికి కూడా అవకాశం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

9912808090
8374168090



నెల్లూరు | సంపుటి - 1 | సంచిక -19 | శనివారం 17 అక్టోబర్ 2026 | ఎడిటర్: కడియాల చిన్నయరెడ్డి | పేజీలు : 4 | వెల : 2/-




## స్థానిక ఎన్నికల వేళ టీడీపీలోకి
# వలసల జోరు

- వైసీపీని వీడి టీడీపీలో చేరిన ఇస్లాంపేటకు చెందిన 25 కుటుంబాలు
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

**నెల్లూరు,(అక్షర దర్శిని):** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సర్వేపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి వలసల జోరు కొనసాగుతోంది. వెంకటాచలం మండలం కురిచెర్లపాడు పంచాయతీ పరిధిలోని ఇస్లాంపేటకు చెందిన 25 కుటుంబాలు శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. నెల్లూరు వేదాయపాళెంలోని సోమిరెడ్డి కార్యాలయంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో పఠాన్ మస్తాన్, అల్లభక్షు, నన్నే సాహెబ్, షేక్ మహబూబ్ భాషా, కరిముల్లా తదితరులు ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ

...మిగతా 3లో







## మొక్కజొన్న పంట మాటున...
# గంజాయి సాగు!

- దుత్తలూరులో సుమారు రెండు ఎకరాల్లో అక్రమ సాగు గుర్తింపు
- డ్రోన్ సాయంతో గుట్టురట్టు.. నలుగురు వ్యక్తులు అదుపులోకి

**గంజాయి వెనుక అంతర్రాష్ట్ర నెట్‌వర్క్‌పై పోలీసుల ఆరా**

**దుత్తలూరు,(అక్షర దర్శిని) :** మొక్కజొన్న పంట మాటున గంజాయి సాగు చేస్తున్న అక్రమ వ్యవహారాన్ని ౹ూా= నెల్లూరు జిల్లా పోలీసులు వెలుగులోకి తెచ్చారు. దుత్తలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయ భూమిలో డ్రోన్ సాంకేతికతతో తనిఖీలు నిర్వహించి సుమారు రెండు ఎకరాల్లో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి సాగు వెనుక ఉన్న వ్యక్తులు, ఆర్థిక సహకారం అందించినవారు, కొనుగోలుదారులు, సరఫరా మార్గాలపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 15వ తేదీన దుత్తలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి సాగు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఎస్ఐ ఉన్నతాధికారులకు సమాచారం అందించి, వారి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి సంబంధిత వ్యవసాయ భూమిలో తనిఖీలు చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్ సమక్షంలో ప్రత్యేక పోలీసు బృందం పరిశీలన నిర్వహించింది. దుత్తలూరు గ్రామ శివారులోని సర్వే నంబరు 1582-2లో

...మిగతా 2లో

# వైసీపీకి మరో షాక్..

- టీడీపీలోకి సన్నపురెడ్డి సోదరులు!
- మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆహ్వానం.. రేపు అధికారికంగా పార్టీలో చేరిక
- వైసీపీ అగ్రనేతల తీరుపై అసంతృప్తితో రాజీనామా నిర్ణయం..
- కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి



**నెల్లూరు,(అక్షర దర్శిని):** నెల్లూరు నగర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రముఖ నాయకులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, సన్నపురెడ్డి సుబ్బారెడ్డి, మంచికంటి శ్రీనివాసులు తెలుగుదేశం పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. వైసీపీలో తమకు తగిన గుర్తింపు, ప్రాధాన్యం

...మిగతా 3లో



# విద్యాలక్ష్మి అలంకారంలో ఆదిలక్ష్మి

**పెంచలకోనలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు..**

పెంచలకోన,(అక్షర దర్శిని): పెంచలకోన క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆరో రోజు శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామివారి పట్టమహిషి ఆదిలక్ష్మి అమ్మవారు విద్యాలక్ష్మి అలంకారంలో పద్మపీఠంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పుష్పాలంకరణతో పాటు 10 గంటలకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం

...మిగతా 3లో



# దోమలు చంపేస్తున్నాయ్ సారూ..

- కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- నివారణా చర్యలు చేపట్టని అధికారులు
- కంటి మీద కునుకు కరువవుతోందని జనం ఆవేదన

**పొదలకూరు,(అక్షరదర్శిని):** ఓ వైపు క్షీణించిన పారిశుధ్యం.. మరో వైపు కాలువల్లో పేరుకుపోయిన పూడిక వెరసి పట్టణంలో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా తెగ కుట్టేస్తున్నాయి. పంచాయతీలో గత నాలుగు నెలలుగా ఈ బెడద అధికమైనప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారు. ఫలితంగా ప్రజలకు రాత్రివేళ కంటిమీద కునుకు కరువవుతోంది. పారిశుధ్యం అధ్వానంగా ఉండడం, కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమల బెడద చాలా అధికంగా ఉన్నట్టు చెపుతున్నారు. కొన్ని వార్డులలో కాలువలు సరిగా శుభ్రం చేయడం లేదు. పూడిక పేరుకుపోవడంతో నీరు ముందుకు పారడం లేదు. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇళ్లలో పరిశుభ్రత పాటిస్తున్నప్పటికీ పరిసర ప్రాంతాలు చెత్తాచెదారంగా మారడం దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పంచాయతి అధికారులు దోమల నివారణా చర్యలు చేపట్టకపోవడంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దోమల మందు పిచికారీ, ఫాగింగ్ చేయడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక మస్కిటో కాయిల్స్, మస్కిటో బ్యాట్లు వంటివి ఉపయోగించి తాత్కాలిక ఉపశమనం పొందుతున్నామని అంటున్నారు. దోమల వ్యాప్తి కారణంగా అంటువ్యాధుల భయం వెంటాడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతి అధికారులు దోమల నివారణ చర్యలతో పాటు కాలువల్లో పూడిక తీయించాలని ప్రజలంతా కోరుతున్నారు.

# మొక్కజొన్న పంట మాటున గంజాయి సాగు!









**మొదటి పేజీ తరువాయి**

సుమారు 9.5 ఎకరాల వ్యవసాయ భూమిలో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నట్లు గుర్తించారు. అయితే డ్రోన్ ద్వారా పరిశీలించగా, మొక్కజొన్న పంట మధ్యలో సుమారు రెండు ఎకరాల్లో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు బయటపడింది. గంజాయి మొక్కలకు డ్రిప్ విధానంలో నీటి సరఫరా ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం అధికారుల సమక్షంలో గంజాయి మొక్కలను తొలగించి తగులబెట్టినట్లు తెలిపారు.

**కొనుగోళ్లకు ముందస్తు ఒప్పందాలు?** పోలీసు బృందం తనిఖీలకు వెళ్లిన సమయంలో అక్కడ పనిచేస్తున్న కొందరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించగా, అప్రమత్తమైన పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో గంజాయి సాగుకు ఆర్థిక సహకారం అందించడం, పంటను కొనుగోలు చేసేందుకు ముందస్తుగా డబ్బులు చెల్లించడం, పంట చేతికి వచ్చిన తర్వాత సరఫరా చేయాలనే ఒప్పందాలు వంటి అంశాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తుల ప్రమేయం ఉందా? గంజాయిని ఎక్కడికి తరలించేందుకు ప్రణాళిక రూపొందించారు? సాగు వెనుక ప్రధాన సూత్రధారులు ఎవరు? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఒక నిందితుడు గతంలో గంజాయి రవాణా, విక్రయాలకు సంబంధించిన వ్యవహారాల్లో పాల్గొన్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. పాత కేసులు, ఆర్థిక లావాదేవీలు, ఇతర వ్యక్తులతో ఉన్న సంబంధాలను ధ్రువీకరిస్తున్నారు.

**నెట్‌వర్క్‌పై ప్రత్యేక దృష్టి** గంజాయి సాగుకు ఉపయోగించిన భూమి, విత్తనాల సమకూర్పు, నీటి సరఫరా ఏర్పాట్లు, ఆర్థిక వనరులు, పంట కొనుగోలు, రవాణా, విక్రయాలకు సంబంధించిన వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. కేవలం సాగుదారులకే పరిమితం కాకుండా, ఈ అక్రమ వ్యాపారం వెనుక ఉన్న ఇతర వ్యక్తులను కూడా గుర్తించేందుకు చర్యలు చేపట్టారు.

**కఠిన చర్యలు తప్పవు: ఎస్పీ అజిత వేజెండ్ల** జిల్లాలో గంజాయి సాగు, మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అక్రమ కార్యకలాపాలను గుర్తించాలని, వాటి వెనుక ఉన్న ఆర్థిక వనరులు, సరఫరా మార్గాలు, కొనుగోలుదారులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం యువత భవిష్యత్తుకు, సమాజ ఆరోగ్యానికి హానికరమని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు, నిల్వ, రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా పోలీసు కార్యాలయం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# విద్యాలక్ష్మి అలంకారంలో ఆదిలక్ష్మి



**మొదటి పేజీ తరువాయి**

ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారిని అలంకరించి ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామివారికి అన్నకూటోత్సవం (తిరుప్పావడ సేవ) నిర్వహించారు. ప్రధానార్చకులు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ ఈ సేవ వైభవంగా సాగింది. ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ సేవలో రూ.500 చెల్లించి పాల్గొనే భక్తులకు గోత్రనామాలతో అర్చన, తీర్థప్రసాదాలతో పాటు కిలో పులిహోర అందజేస్తారు. భక్తులు ఆలయ సేవలను ఝఝ.ఖజూవఎజూశ్రీం.శీతీస్త్ర వెబ్‌సైట్ లేదా మనమిత్ర వాట్సాప్ సేవ 9552300009 ద్వారా పొందవచ్చని ఆలయ అధికారులు తెలిపారు.

# వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు



## అనుచరులతో కలిసి పసుపు కండువా కప్పుకున్న 63వ డివిజన్ వైసీపీ నేత జుబేరుద్దీన్

## అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో చేరికలు.. అభివృద్ధే ఆకర్షణగా టీడీపీలోకి మైనారిటీ నాయకులు



**నెల్లూరు,(అక్షర దర్శిని) :** స్థానిక ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు నగర రాజకీయాల్లో సమీకరణాలు మారుతున్నాయి. వైఎస్సార్‌సీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా నెల్లూరు నగరంలోని 63వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకుడు మొహమ్మద్ జుబేరుద్దీన్ తన అనుచరులతో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ జుబేరుద్దీన్‌తో పాటు పార్టీలో చేరిన ఇతర మైనారిటీ నాయకులు, కార్యకర్తలకు పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నెల్లూరు నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ



వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

**పార్టీ బలోపేతంపై మంత్రి దిశానిర్దేశం** టీడీపీలో కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని మంత్రి నారాయణ సూచించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. డివిజన్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసి, రాబోయే స్థానిక ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించేలా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన నాయకులకు తగిన ప్రాధాన్యం కల్పిస్తూ, పాత నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగాలని సూచించారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి డివిజన్‌లో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలని, ప్రజల విశ్వాసాన్ని పొందేలా పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. నెల్లూరు నగరంలో స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వివిధ పార్టీల నాయకుల చేరికలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.

# వైసీపీకి మరో షాక్..





**మొదటి పేజీ తరువాయి**

లభించకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు వెల్లడించారు. వీరు శనివారం అధికారికంగా టీడీపీలో చేరనున్నట్లు సమాచారం. సన్నపురెడ్డి సోదరుల కార్యాలయానికి వెళ్లిన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులు వారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్న నాయకులను సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**సన్నపురెడ్డి సోదరులకు మంచి ప్రజాబలం: మంత్రి నారాయణ**

సన్నపురెడ్డి పెంచలరెడ్డి, సుబ్బారెడ్డి, మంచికంటి శ్రీనివాసులు వైసీపీ నుంచి టీడీపీలో చేరాలని నిర్ణయించుకోవడం శుభపరిణామమని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ప్రజలతో సంబంధాలు కలిగి, రాజకీయంగా అనుభవం ఉన్న నాయకులు పార్టీలోకి రావడం పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**నగర, గ్రామీణ ప్రాంతాల్లో మంచి పలుకుబడి: ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి**

సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఆయన సోదరుడు సుబ్బారెడ్డికి నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల్లో మంచి పలుకుబడి ఉందని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంచికంటి శ్రీనివాసులు కూడా వైసీపీకి రాజీనామా చేసి, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరాలని నిర్ణయించుకోవడం సంతోషకరమన్నారు. సన్నపురెడ్డి సోదరులు ఏ పార్టీలో ఉన్నా నిబద్ధతతో, అంకితభావంతో పనిచేస్తారని పేర్కొన్నారు. వీరి చేరికతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**గుర్తింపు లేకపోవడంతోనే పార్టీ మార్పు: పెంచలరెడ్డి**

తాము పార్టీలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజల్లో మమేకమయ్యామని సన్నపురెడ్డి పెంచలరెడ్డి తెలిపారు. అయినప్పటికీ తమ సేవలను గుర్తించకుండా విస్మరించడంతోనే వైసీపీని వీడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. టీడీపీలో చేరిన అనంతరం పార్టీ నాయకత్వం సూచనల మేరకు పనిచేస్తూ, రాబోయే నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని వెల్లడించారు.

**వైసీపీకి రాజకీయంగా ఎదురుదెబ్బ?** నెల్లూరు నగరంలో స్థానిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ మార్పులు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ఇప్పటికే పలువురు నాయకులు టీడీపీ వైపు మొగ్గుచూపుతున్న తరుణంలో, సన్నపురెడ్డి సోదరులు, మంచికంటి శ్రీనివాసులు సైతం పార్టీ మారాలని నిర్ణయించుకోవడం వైసీపీకి రాజకీయంగా ఇబ్బందికర పరిణామమని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. వీరి చేరికలు రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

# స్థానిక సంస్థల ఎన్నికలకు 20 అంశాలపై నోడల్ అధికారులు

**స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం**
**అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశాలు..**
**విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు**



**నెల్లూరు,(అక్షర దర్శిని):** జిల్లాలో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల సాధారణ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్ల నోడల్ అధికారులను నియమించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు 20 అంశాలకు సంబంధించి అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, శాంతిభద్రతల పరిరక్షణ, భద్రతా ప్రణాళిక, సిబ్బంది నియామకం, శిక్షణ, ఎన్నికల సామగ్రి ముద్రణ, రవాణా, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ, పరిశీలకులకు సమాచారం అందించడం, మీడియా నిర్వహణ, కంప్యూటరీకరణ, ఫిర్యాదుల పరిష్కారం, వెబ్‌కాస్టింగ్, పోస్టల్ బ్యాలెట్లు, మైక్రో అబ్జర్వర్ల నియామకం, పోలింగ్ కేంద్రాల నిర్వహణ, బ్యాలెట్ బాక్సులు, ఓటర్ల జాబితాల నిర్వహణ తదితర అంశాలను నోడల్ అధికారులకు కేటాయించారు.

**వివిధ శాఖల అధికారులకు బాధ్యతలు** ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లును నియమించారు. శాంతిభద్రతలు, ఎన్నికల భద్రతా ప్రణాళిక బాధ్యతలను జిల్లా రెవెన్యూ అధికారి ఎన్. విజయకుమార్, అదనపు ఎస్పీ సౌజన్యకు అప్పగించారు. సిబ్బంది నిర్వహణ, రాండమైజేషన్‌కు సంబంధించి డిప్యూటీ కలెక్టర్ జి. కేశవర్ధన్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు, ఇతర సంబంధిత అధికారులకు బాధ్యతలు కేటాయించారు. బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పరిశీలన, పంపిణీ బాధ్యతలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సన్నీ వంశీకృష్ణకు అప్పగించారు. రవాణా నిర్వహణకు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ బి. చందర్, శిక్షణ నిర్వహణకు జి. కేశవర్ధన్‌రెడ్డిని నియమించారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణకు జిల్లా ఆడిట్ అధికారి డి. సింహాద్రి, డీసీవో గుర్రప్పకు బాధ్యతలు అప్పగించారు. పరిశీలకుల పర్యటనలు, వారికి అవసరమైన సమాచారం అందించేందుకు డీఎస్‌వో ఐ. పుల్లయ్య, కె. శ్రీనివాసులును నియమించారు. కంప్యూటరీకరణ బాధ్యతలను ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సీహెచ్ శ్రీరాములుకు అప్పగించారు. వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ నిర్వహణకు ఆర్ఐఓ టి. వరప్రసాద్‌రావు, సంబంధిత అధికారులకు బాధ్యతలు కేటాయించారు.పోస్టల్ బ్యాలెట్లు, సర్వీస్ ఓటర్లకు సంబంధించిన విధుల కోసం డీఆర్‌డీఏ పీడీ వి. నాగరాజుకుమారిని, మైక్రో అబ్జర్వర్ల నియామకం, శిక్షణ కోసం ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శివకుమార్‌ను నియమించారు. పోలింగ్ కేంద్రాల నిర్వహణకు పీఆర్ఎస్ఈ కోటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయభాస్కర్, బ్యాలెట్ బాక్సుల నిర్వహణకు మెప్మా పీడీ కిరణ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు.ఓటర్ల జాబితాల నిర్వహణకు డిప్యూటీ కలెక్టర్ సోమ్లా నాయక్, మీడియా, సమాచార నిర్వహణకు జిల్లా పౌరసంబంధాల అధికారి పి. వేణుగోపాల్‌రెడ్డి, ఎన్నికల ఫిర్యాదుల పరిష్కారానికి చీఫ్ ప్లానింగ్ అధికారి టి. లక్ష్మీనరసింహులును నియమించారు. ఎన్నికలకు సంబంధించిన వార్తలు, పత్రికా కథనాల పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా పౌరసంబంధాల అధికారితో పాటు జిల్లా బీసీ సంక్షేమ అధికారి పి. వెంకటలక్ష్మమ్మకు అప్పగించారు.

**నిర్లక్ష్యం వహిస్తే చర్యలు** ఎన్నికల విధులకు నియమితులైన నోడల్ అధికారులు సంబంధిత నియమ నిబంధనలు, విధివిధానాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్ల సూచించారు. తమకు కేటాయించిన బాధ్యతలను సకాలంలో సమర్థవంతంగా నిర్వహిస్తూ, ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినా తీవ్రంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు.నోడల్ అధికారులకు అవసరమైన సిబ్బందిని కేటాయించాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లా పంచాయతీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# మాదిగలకు సమానంగా అవకాశం కల్పించాలి..

▸▸ సీట్లు ఇవ్వకపోతే సత్తా చాటుదాం



**నెల్లూరు(అక్షర దర్శిని)** నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల తో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీలకు కేటాయించిన స్థానాలలో మాదిగలకు సమాన అవకాశాలు కల్పించాలని లేకపోతే పోటీ చేసి సత్తా చాటుతామని పలువురు దళిత నేతలు పేర్కొన్నారు. నెల్లూరు అంబేద్కర్ భవనంలో మాదిగ సంఘాలు ఎమ్మార్పీఎస్ ఇతర దళిత సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు సమానంగా కార్పొరేటర్ సీట్లు కేటాయించాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు మాట్లాడుతూ నెల్లూరు కార్పొరేషన్ లో పది ఎస్సీలకు కేటాయిస్తే కేవలం రెండు మాత్రమే మాదిగలకు కేటాయించారని ఇది తీరని అన్యాయం అన్నారు. సర్పంచ్ , ఎంపిటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో మాదిగలకు ఇకనైనా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాతంగ కృష్ణ, ఆల్ఇండియా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ యునైటెడ్ ఫోరం జాతీయ అధ్యక్షులు దేగ రవి రాఘవేంద్ర , ఎమ్మార్పీఎస్ నాయకులు కలివేల ఎలీషా కుమార్,. ఆల్ఇండియా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ యునైటెడ్ ఫోరం జాతీయ ఉపాధ్యక్షులు వేగురు విజయ్ కుమార్ . ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కుడుముల సుబ్బారావు, ఈ కార్యక్రమంలో మామిడూరు రవీంద్ర. రమణయ్య. సగిల గురవయ్య. రమేష్ సునీల్. వేణు. నాగార్జున. వెంకటాద్రి. కొంచం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు





# ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలికకు రక్షణ.. తల్లికి అప్పగింత

▸▸ డీసీపీయూ, చైల్డ్‌లైన్ సిబ్బంది సమన్వయంతో చర్యలు

▸▸ బాలికకు కౌన్సెలింగ్.. పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగాలని తల్లిదండ్రులకు సూచన

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** ఇంట్లో తల్లి మందలించడంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలికను అధికారులు రక్షించి, కౌన్సెలింగ్ అనంతరం తల్లికి అప్పగించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం (డీసీపీయూ), చైల్డ్‌లైన్ సిబ్బంది సమన్వయంతో ఈ చర్యలు చేపట్టారు.వివరాల్లోకి వెళితే.. మంగళగిరికి చెందిన బాలిక ఈ నెల 12న ఇంట్లో పనులు సక్రమంగా చేయలేదని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైంది. దీంతో ఇంటి నుంచి వెళ్లిపోయి మంగళగిరి రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కి గూడూరు రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అక్కడ విధుల్లో ఉన్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు బాలిక విషయాన్ని హెల్ప్‌లైన్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన చైల్డ్‌లైన్ సిబ్బంది బాలికను సంరక్షణలోకి తీసుకున్నారు.అనంతరం బాలికను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ముందు హాజరుపరిచారు. కమిటీ ఆదేశాల మేరకు బాలికకు అవసరమైన సంరక్షణ కల్పించారు. డీసీపీయూ, చైల్డ్‌లైన్ సిబ్బంది సమన్వయంతో బాలిక తల్లిదండ్రుల వివరాలను సేకరించి, ఆమె తల్లికి సమాచారం అందించారు.

**కౌన్సెలింగ్ అనంతరం తల్లికి అప్పగింత** ఈ నెల 16న బాలిక తల్లిని పిలిపించి అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. పిల్లల పట్ల ప్రేమాభిమానాలతో వ్యవహరించాలని, వారి భావోద్వేగాలను అర్థం చేసుకుంటూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, వారి సమస్యలను ఓపికగా వినాలని హితవు పలికారు. అనంతరం బాలికను తల్లికి అప్పగించారు.జిల్లా బాలల సంరక్షణ అధికారి బి. సురేష్ ఆదేశాల మేరకు డీసీపీయూ, చైల్డ్‌లైన్ సిబ్బంది ఈ చర్యలు చేపట్టారు. పిల్లల భద్రత, సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ, కుటుంబ సమస్యల కారణంగా వారు ఇంటి నుంచి వెళ్లిపోయే పరిస్థితులు తలెత్తకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# స్థానిక ఎన్నికల వేళ టీడీపీలోకి వలసల జోరు



**మొదటి పేజీ తరువాయి**

నియోజకవర్గంలో ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.








## ముత్తుకూరు పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు

- 20 గ్రామ పంచాయతీలకు సర్పంచ్ స్థానాల కేటాయింపు

**ముత్తుకూరు (అక్షర దర్శిని)** ముత్తుకూరు మండలం లోని 20 గ్రామ పంచాయతీల సర్పంచ్ పదవులు, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల వివరాలు వెల్లడయ్యాయి. శుక్రవారం వెల్లడైన ఈ వివరాల ప్రకారం బ్రహ్మదేవం, దొరువుపాలెం, మామిడిపూడి, ముత్తుకూరు, తాళ్లపూడి గ్రామ పంచాయతీలు జనరల్ కేటగిరీకి కేటాయించగా, దమ్మాయపాలెం, పోలంరాజుగుంట ఎస్సీ, దువ్వూరు వారిపాలెం బీసీ మహిళ, ఈపూరు బిట్-1ఏ ఎస్సీ మహిళ, కృష్ణపట్నం బీసీ, మల్లూరు ఎస్సీ మహిళ, ముసునూరివారిపాలెం ఎస్టీ మహిళ, నారికేళ్లపల్లి ఎస్టీ కేటగిరీలకు కేటాయించారు. నెలటూరు, పంటపాలెం, పా టూరివారికండ్రిగ, పైనాపురం, వల్లూరు గ్రామ పంచాయ తీలు జనరల్ మహిళా కేటగిరీకి కేటాయించగా, పిడితపో లూరు బీసీ మహిళ, సర్వేపల్లి బిట్-వి ఎస్సీ కేటగిరీలకు కేటాయించినట్లు జాబితాలో పేర్కొన్నారు. రిజర్వేషన్ల వివ రాలు వెలువడటంతో ఆయా గ్రామాల్లో సర్పంచ్, వార్డు స భ్యులుగా పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు తమకు అనుకూలమైన అవకాశాలపై దృష్టి సారించనున్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు...




**పాకాల (అక్షర దర్శిని)** చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం గాదంకి గ్రామంలో పాకాల పి.ఎ.సి.ఎస్ ఖాతాదారులకు మరియు సంఘ సభ్యులకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు సంఘం అధ్యక్షురాలు కృష్ణమనేని సావిత్రి ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘము నందు రైతులు అందరూ రూ.300 చెల్లించి సభ్యత్వం తీసుకుని అదేవిధంగా సంఘం ద్వారా అందిస్తున్న స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు మరియు హౌస్ మార్టిగేజ్ లోన్స్ పొంది తిరిగి సకాలంలో రుణాలు చెల్లించి రైతులు అందరూ అభివృద్ధి బాటలో పయనిస్తూ సంఘంను కూడా బలోపేతం చేయవలసినదిగా కోరారు. ఈ సమావేశంలో డీసీసీబి సూపర్వైజర్ ఈ.దొరస్వామి, సంఘ ముఖ్య కార్య నిర్వహణ అధికారి బి.మురళీ కృష్ణ, సంఘ సిబంది, రైతులు పాల్గొన్నారు.

## సీఐని కలసి సన్మానించిన అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు

**చిట్టమూరు(అక్షర దర్శిని)** నాయుడుపేట అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తురక వెంకటరమణయ్య (గబ్బర్ సింగ్)కు బురదగాలి గ్రామస్థులు, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఇటీవల అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయనను శుక్రవారం కలిసి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో చిట్టమూరు మండలంలోని బురదగల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటులో వెంకటరమణయ్య కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా గ్రామస్థులు గుర్తుచేశారు.సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచే అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆయన అందించిన సహకారం మరువలేనిదని కొనియాడారు. ఆయన సేవలను గుర్తిస్తూ గ్రామస్థులు,విగ్రహ కమిటీ సభ్యులు కలిసి సత్కరించడం ఆనందంగా ఉందన్నారు.నూతన బాధ్యతల్లోనూ ప్రజలకు మరింత మెరుగైన సేవలందిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు చిన్న వెంకటయ్యతో పాటు బురదగాల్లి గ్రామస్థులు, అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# నెల్లూరు రూరల్ టీడీపీలోకి వైసీపీ నేతలు..





- చలపతినగర్‌కు చెందిన పలువురి చేరిక
- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సమక్షంలో కండువాలు

**నెల్లూరు రూరల్ (అక్షర దర్శిని)** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన చలపతినగర్ నాయకులు బాల నారాయణరెడ్డి, నన్నం జయపాల్, బోయరాజు, నారాయణరాజు, రమేష్ తమ మిత్రబృందంతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సమక్షంలో వీరు పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూరల్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకులు కాకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలిచే కూటమి అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని కోరారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 36 డివిజన్లలో మేయర్ అభ్యర్థితోపాటు కార్పొరేటర్ అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇచ్చి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నగరపాలక సంస్థపై కూటమి జెండా ఎగురుతుందన్న ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి, మేకల మధు, పుల్లారెడ్డి, చల్లా సుబ్బన్న, మస్తాన్‌రెడ్డి, మల్లికార్జున, రమణయ్య, మురళిరెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన పోలేరమ్మ

- మూలా నక్షత్రం సందర్భంగా విశేష పూజలు..
- సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలు

**మనుబోలు (అక్షర దర్శిని)** మనుబోలు, అక్టోబర్ 16: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మనుబోలు కోదండరామాపురం దేవాంగుల వీధిలో కొలువై ఉన్న శ్రీ పోలేరమ్మ అమ్మవారు శుక్రవారం సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమా లను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా వేకువజామున అర్చకులు శ్రీనివాసులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, మహా నివేదన సమర్పించారు. అనంతరం విశేష హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారిని సరస్వతీ దేవి అలంకారంలో పూలతో సుందరంగా అలంకరించి కొలువుదీర్చా రు.అనంతరం మహాగణపతి పూజ, దేవి ఖడ్గమాలార్చన, సామూహిక కుంకుమార్చనలను వేదమంత్రోచ్ఛారణల మధ్య సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు ఉభయకర్తలుగా అరూరు అనిల్ కుమార్--అనిత దంపతులు వ్యవహరించారు.మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అర్చకులు శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

# నాయుడుపేట మున్సిపల్ పీఠంపై ఆధిపత్య పోరు!

- చైర్‌పర్సన్ పదవి జనరల్ మహిళకు.. టికెట్ల కేటాయింపుపై ఉత్కంఠ
- కూటమిలో సీట్ల సర్దుబాటు కసరత్తు.. రెబల్స్ బెడద
- తెరపై పార్టీల పోరు.. తెరవెనుక రాజకీయ సమీకరణాలు

**నాయుడుపేట (అక్షర దర్శిని)** నాయుడుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం జనరల్ మహిళకు రిజర్వు కావడంతో 32 వార్డుల మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. నామినేషన్ల ప్రక్రియకు సమయం సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక, టికెట్ల కేటాయింపు, సీట్ల సర్దుబాటుపై ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా అధికార కూటమిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ మధ్య సీట్ల పంపకాలపై చర్చలు కొనసాగుతున్నప్పటికీ, ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో తుది నిర్ణయాలు తీసుకోవడం సవాలుగా మారినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. కేకే కల్యాణమండపం వేదికగా కూటమి నాయకులు సమావేశమై అభ్యర్థుల ఎంపిక, సీట్ల సర్దుబాటుపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. టికెట్లు ఆశిస్తున్న నేతల్లో ఎవరికి అవకాశం దక్కుతుంది, ఎవరికి నిరాశ ఎదురవుతుం దన్నది తేలాల్సి ఉంది. టికెట్లు దక్కని అసంతృప్తులు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగే అవకాశం ఉండటంతో రెబల్స్ బెడదపై నాయకులు దృష్టి సారిస్తున్నారు. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా తన అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల వ్యూహాలపై దృష్టి సారించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రాజకీయ




పరిణామాల మధ్య నాయుడుపేటలో పార్టీల మధ్య పోటీతోపాటు, స్థానిక నాయకుల మధ్య వ్యక్తిగత ఆధిపత్య సమీకరణాలు కూడా చర్చనీయాం శంగా మారాయి. గత కొన్నేళ్లుగా స్థానిక రాజకీయాల్లో ప్రభావం చూపుతున్న నాయకత్వ వర్గాలు, వారి అనుచరుల పాత్ర అభ్యర్థుల ఎంపికపై ప్రభావం చూపుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే తెరవెనుక ఎవరు ఎవరికి మద్దతు ఇస్తున్నారు, ఎవరిని వ్యతిరేకిస్తున్నారు అనే అంశాలపై అధికారి కంగా స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో తుది అభ్యర్థుల జాబితాలు వెలువడిన తర్వాతే పార్టీల్లో అసంతృప్తులు, సీట్ల సర్దుబాటు, ఎన్నికల వ్యూహాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# దౌర్జన్యాలకు పాల్పడితే వైసీపీకి తగిన గుణపాఠం చెబుతాం

- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హెచ్చరిక
- స్థానిక ఎన్నికల్లో స్వేచ్ఛగా పోటీ చేయాలి

**నెల్లూరు రూరల్ (అక్షర దర్శిని)** వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు, బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదని, ప్రజాస్వామ్య పద్ధతిలోనే వారికి తగిన గుణపాఠం చెబుతామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలను ప్రస్తావిస్తూ, నెల్లూరు రూరల్‌లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత జగన్ ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నదని, అందుకే ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారం అప్పగించారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేయడం సరికాదని హితవు పలికారు. గతంలో వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను రెండేళ్లపాటు వాయిదా వేసిందని, ఎన్నికలను అడ్డుకునేందుకు న్యాయస్థానాలను ఆశ్రయించిందని ఆరోపించారు. పుంగనూరు, రాయచోటి, తిరుపతి ప్రాంతాల్లో నామినేషన్ల తొలిరోజే వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడ్డారని విమర్శించారు. ఎంపీ మిథున్‌రెడ్డి చేసినట్లు చెబుతున్న వ్యాఖ్యలు ఆక్షేపణీయమని పేర్కొంటూ, రాజకీయ పోరాటాన్ని ప్రజాక్షేత్రంలోనే తేల్చుకోవాలని సవాల్ విసిరారు. ఐటీడీపీకి చెందిన వ్యక్తులను వైసీపీ నాయకులు బెదిరించారని ఆరోపించిన ఆయన, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి మేయర్ అభ్యర్థి లక్ష ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తారని, మొత్తం 72 డివిజన్లలోనూ కూటమి అభ్యర్థులే గెలుస్తారని కోటంరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరులో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి జరుగుతోందని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రూరల్ నియోజకవర్గంలో వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడితే టీడీపీ కార్యకర్తలు భయపడవద్దని, వారికి తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు.

Publisher, Editor & Owned by: KADIYALA CHINMAYA REDDY, Thatiparthi Village, Podalakur Mandal, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524309. Printed by: VIJAYA GRAPHICS, D.No. 26-3-1993. Chandramouli Nagar, 1st Steet Veda Yapalem, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524004.